## క్లుప్తంగా

### కవి వాసుకు జాషువా సాహితీ పురస్కారం



తెనాలి: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతి వారోత్సవాల్లో భాగంగా దళిత రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని కార్ప్ సంస్థకు చెందిన ఆర్నాల్డ్ పొలస్ ఆడిటోరియంలో సాహితీ సభను నిర్వహించారు. నిర్వాహక సంఘం అధ్యక్షురాలు, వెడ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి అధ్యక్షత వహించారు. ఇదే సభలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఈ తరానికి చెందిన అయిదుగురు దళిత కవులను గుర్తించి జాషువా సాహితీ పురస్కారాన్ని బహూకరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్నవారిలో తెనాలికి చెందిన పరిశోధకుడు, కవి, సామాజిక ఆలోచనాపరుడు డాక్టర్ పిల్లి వాసు ఉన్నారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, రేడియో రంజన్ డైరెక్టర్ ఎం.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

### మెప్మా సీఎంఎంలు బదిలీ

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని మెప్మా సిటీ మిషన్ మేనేజర్లు మాధవరావు, అరుణ కుమారిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మాధవరావును గుంటూరుకు, అరుణ కుమారిని రేపల్లె మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. రేపల్లెలో పనిచేస్తున్న విజయకుమారిని తెనాలికి పంపారు. వీరు కొద్ది రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

### 29న విజయవాడలో జాషువా జయంతి

తెనాలి: మూడున్నర దశాబ్దాలకు పైగా సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సేవాసంస్థ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్, దుగ్గిరాల ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన మహాకవి జాషువా 129 జయంతి ఉత్సవాలను విజయవాడలో నిర్వహించనున్నారు. అక్కడి బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాయలంలో ఉదయం 10 గంటలనుండి జాతీయస్థాయి కవి సమ్మేళనం, మహాకవి జాషువా పురస్కారాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని సేవాసంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పెద్దీ టి.యోహాన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

### అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లపై చర్యలు తప్పవు

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలో అనధికారికంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో ప్రకటించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా వాటిని ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు అనధికారికంగా ఏర్పాటు చేసిన వాటిని వెంటనే తొలగించాలని సూచించారు.

### ఇసుక అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు



రేపల్లె రూరల్: రేపల్లె డివిజన్ పరిధిలో కృష్ణా నది పరీవాహక ప్రాంతాలలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ లేవని, అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో హెలా షారోన్ హెచ్చరించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం రీచ్‌లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వం కొత్తగా ఇసుక పాలసీని అక్టోబర్ 15 తరువాత ప్రకటించనున్నదని చెప్పారు. ఇసుక పాలసీ వచ్చిన తరువాత అనుమతులు ఉన్న రీచ్‌ల నుంచి కావాల్సిన ఇసుక సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. కొల్లూరు నుంచి రేపల్లె మండలం వరకు రాత్రి సమయాలలో అక్రమంగా కృష్ణానది నుంచి ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలపై అధికారులు పూర్తి నిఘా ఉంచి ఇసుక అక్రమాలను అడ్డుకోవాలని సూచించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వైద్యేతర విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

నిజాంపట్నం: వైద్యేతర విధుల నుంచి తమకు మినహాయింపునివ్వాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్ఓలు) గురువారం ఎంపీడీఓ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సీహెచ్‌వోల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పులి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పెన్షన్ పంపిణీ వంటి వైద్యేతర విధుల వల్ల ఆస్పత్రుల్లో రోగులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంటుందని వివరించారు. కార్యక్రమంలో నిజాంపట్నం మండల సీహెచ్‌వో నాయకులు దీపక్, సింధు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

# గ్రహణం వీడని టిడ్కో గృహాలు

- పూలే కాలనీలో నిలిచిన భవన నిర్మాణ పనులు
- రుణ వాయిదాలు చెల్లించాలంటూ బ్యాంక్‌లు నోటీసులు
- అయోమయంలో లబ్ధిదారులు



పూలే కాలనీలో నిర్మాణంలో ఉన్న టిడ్కో సముదాయం

తెనాలిఅర్బన్: తెనాలి పూలే కాలనీలోని టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు గ్రహణం పట్టింది. గత టీడీపీ ప్రభుత్వం హౌస్ ఫర్ ఆల్ స్కీం కింద వీటి నిర్మాణాలు చేపట్టి మధ్యలో ఆపేశారు. దీంతో అప్పటి నుంచి నిర్మాణాలు పునఃప్రారంభం కాలేదు. ఇది ఇలా ఉంటే లబ్ధిదారులకు బ్యాంక్ అధికారులు ఇటీవల నోటీసులు ఇస్తున్నారు. టిడ్కో ఇళ్ల రుణాలకు సంబంధించిన వాయిదాలు చెల్లించాలని లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

తెనాలి పట్టణంలోని పెదరావూరు, పూలే కాలనీలో గత టీడీపీ ప్రభుత్వం హౌస్ ఫర్ ఆల్ స్కీమ్ కింద అపార్ట్‌మెంట్‌లు నిర్మించి పేదలకు ఇవ్వాలని భావించారు. దీంతో భాగంగా మొదటి విడత కింద తెనాలి–పెదరావూరు మధ్య పొలాల్లో 892 అపార్ట్‌మెంట్‌ను నిర్మాణాలు ప్రారంభించారు. కొద్ది సంవత్సరాలకు పూలే కాలనీలో 1008 అపార్ట్‌మెంట్‌లు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. పెదరావూరులోని భవనాలు 90 శాతం పూర్తి చేశారు. పూలే కాలనీలోని భవనాలు మాత్రం నత్తనడకన సాగుతూ వచ్చి మధ్యలో ఆగిపోయాయి.

**వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెదరావూరులోని టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి వాటిల్లో రోడ్లు, కాల్వలు, మంచినీటి వసతి వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు వాటిని అప్పగించారు. అలాగే తెనాలి నియోజకవర్గ పరిధిలోని గోలిడొంక, పెదరావూరు, నేలపాడు, బుర్రిపాలెం, సిరిపురం, జగ్గడిగుంటపాలెం తదితర ప్రాంతాలలో జగనన్న కాలనీల కోసం భూమిని కొనుగోలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అంతేకాకుండా మొదటి విడత కింద ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వాటిలో కొన్నింటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించారు.

**నిలిచిన నిర్మాణాలు**

పూలే కాలనీలో 13 ఎకరాలలో 1008 అపార్ట్‌మెంట్‌లు నిర్మించాలని అధికారులు భావించారు. వాటిలో 300చ.గ ప్లాట్‌లు 288, 365చ.గ ప్లాట్‌లు 579, 430 చ.గవి 144 ప్లాట్‌లు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసి 300.చ.గ వారితో రూ.500, 365చ.గ వారితో రూ.50 వేలు, 430 చ.గ వారితో రూ.లక్ష డీడీలు తీయించారు. అనంతరం నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు. దీనివల్ల మొత్తం 21 బ్లాక్‌లలో మూడు ఫ్లోర్‌లు పూర్తి చేసినవి 12 బ్లాక్‌లు, గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి అయినవి 5 బ్లాక్‌లు, బేస్‌మెంట్ స్టేజీలో నాలుగు బ్లాక్‌లు ఉన్నాయి. సుమారు ఆరు సంవత్సరాల నుంచి వీటి నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి.

**బ్యాంకు రుణాల చెల్లింపులు ఇలా...**

పూలే కాలనీలో 300, 365, 430 చదరపు గజాలలో అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో అపార్ట్‌మెంట్‌కు రూ.1.50 లక్షల చొప్పున నిధులు విడుదల చేశాయి. మిగిలిన నిధులు బ్యాంక్‌ల ద్వారా సమకూర్చారు. వాటిని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. 300 చదరపు గజాల ప్లాట్ నిర్మాణానికి రూ.6.65 లక్షలు, 360 చదరపు గజాల ప్లాట్‌కు రూ.8.38 లక్షలు, 430 చదరపు గజాల ప్లాట్‌కు రూ.10.14 లక్షల ఖర్చు అవుతుంది. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రూ.3 లక్షల నగదుతో పాటు లబ్ధిదారులు మొదట చెల్లించిన నగదును మినహాయించగా, 300 చ.గ లబ్ధిదారులు రూ.3.65 లక్షలు, 365 చ.గ లబ్ధిదారుడు రూ.4.88 లక్షలు, 430 చ.గ లబ్ధిదారుడు రూ.6.14 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 300 చదరపు గజాల ప్లాట్ లబ్ధిదారులకు ఉచితంగా వాటిని రిజిస్ట్రేషన్ చేసి అందించింది. అంతేకాకుండా 365 చ.గ ప్లాట్ లబ్ధిదారుడు మొదటి చెల్లించిన రూ.50 వేలలో రూ.25 వేలు, 430 చ.గ లబ్ధిదారుడు చెల్లించిన రూ.లక్షలో రూ.50 వేలు ప్రభుత్వం వెనక్కి తిరిగి ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

### రుణాలు చెల్లించాలని బ్యాంక్‌లు నోటీసులు

పూలే కాలనీలో ఇంత వరకు పూర్తి స్థాయిలో టిడ్కో భవనాలు నిర్మించకుండా లబ్ధిదారులకు బ్యాంక్ అధికారులు నోటీసులు పంపుతున్నారు. టిడ్కో నివాసాల కోసం రుణాలు ఇచ్చామని, వాటిని చెల్లించాలని వాటిలో పేర్కొంటున్నారు. అలా చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు అసలు భవనాలు నిర్మించి ఇస్తారో లేదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇదిలా ఉంటే బ్యాంక్‌లలో రుణ వాయిదాలు పెండింగ్‌లో ఉన్నాయని అకౌంట్‌లు చూపటం వల్ల సిబిల్ స్కోర్ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా తమకు అపార్ట్‌మెంట్‌లు అప్పగించిన తర్వాత రుణాలకు సంబంధించిన వాయిదాలు చెల్లించాలనే నిబంధన ఉందని, దానికి విరుద్ధంగా బ్యాంక్ అధికారులు వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### రుణ వాయిదాలు చెల్లించనవసరం లేదు



పూలే కాలనీలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంక్‌లు నోటీసులు ఇస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించే వరకు టిడ్కో బాధ్యత వహిస్తుంది. వారే రుణాలకు సంబంధించిన వడ్డీలు చెల్లిస్తారు. లబ్ధిదారులు ఎవరు అందోళన చెందాల్సిన అవసరం లేదు. రుణ వాయిదాలు ఇప్పుడే చెల్లించాల్సిన అవసరం కూడా లేదు.

–బండి శేషన్న,
కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

## సమస్యల పరిష్కారానికే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



సిబ్బందికి సూచనలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 18, 19, 29 వార్డులలో గురువారం పారిశుద్ధ్య నిర్వహణ పనులను నిర్వహించారు. ఆయా వార్డులోని మురుగు కాల్వలను బాగు చేయించడం, స్ప్రెయింగ్, బ్లీచింగ్ చల్లించడం, వ్యర్థాలను తొలగించడం వంటివి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను తమ దృష్టి తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పంట పొలాలు పరిశీలించిన జెడ్పీ చైర్‌పర్సన్



రైతులతో కలిసి పంటపొలాలను పరిశీలిస్తున్న హెనీ క్రిస్టినా

తెనాలి: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా శుక్రవారం తెనాలి మండలంలోని కొలకలూరు, హాఫ్‌పేట ఖాజీపేట గ్రామాల్లోని నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు. పంటపొలాల్లో అనేకచోట్ల ఇప్పటికీ పూర్తిగా నీరు ఇప్పటికీ బయటకు పోకపోవడాన్ని గమనించారు. అక్కడి రైతులను పలకరించారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంట వేసుకుంటే అకాల వర్షంతో పొలాలన్నీ నీటి మునిగి చెరువుల్లా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. పంట ఎందుకూ పనికిరాదని చెప్పారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పంట పొలాలను చూస్తుంటే చాలా ఆవేదనగా ఉందన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి సహాయం అందేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం హాఫ్‌పేట గ్రామాన్ని సందర్శించారు. ఇంకా నీరు నిలిచివున్న కాలనీకి వెళ్లి, స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, వరదలతో తమ కాలనీ అంతా నీట మునిగిందని చెప్పారు. తమ ఇళ్లలోని గృహోప కరణాలు పాడయ్యాయని, కరెంటు లేదని తినడానికి కూడా నిత్యవసరాలు లేవని పలువురు మహిళలు తమ బాధలను వివరించారు.

## నెలలోపు నష్టపరిహారం అందించాలి

- వాణిజ్య పంటలకు లక్షన్నర..
- వరికి రూ.25 వేలు నష్ట పరిహారమివ్వాలి
- లంక గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు రుణాలు రద్దు చేయాలి
- రెండవ పంటకు పెట్టు బడి సాయం అందించాలి
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య



తహసీల్దార్ సిద్ధార్థకు వినతి పత్రం అందజేస్తున్న వి.కృష్ణయ్య, డ్వాక్రా మహిళలు

కొల్లిపర: ఆగస్టు 30,31 తేదీలలో కురిసిన భారీ వర్షాల వలన, కృష్ణా నదిలో వచ్చిన వరదలు కారణంగా పంట పొలాలు తీవ్రంగా నష్టపోయిన ప్రతి రైతు, కౌలు రైతులకు ప్రభుత్వం ఎకరానికి వాణిజ్య పంటలకు రూ.50 వేలు నుంచి లక్షన్నర వరకు, వరికి 25 వేలు నష్ట పరిహారం అందించాలి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య కోరారు.కొల్లిపర రెవెన్యూ కార్యాలయం వద్ద ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, మహిళ సంఘం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాస్‌కుమారి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివసాంబిరెడ్డి తోకలసి గురువారం ఆయన ఇటీవలన వదలు కారణంగా నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ధర్నా నిర్వహించి, తహసీల్దార్ జి.సిద్ధార్థకు వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ వరదలు కారణంగా నష్టం జరిగిన లంక గ్రామాలైన అన్నవరపు లంక, బొమ్మువానిపాలెం గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు గత రుణాలు రద్దు చేసి, కొత్తగా లక్ష రూపాయల రుణం ఇప్పించాలని, ఇటీవలన దుగ్గిరాల శుభమ్ మహేశ్వరీ కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్ని బాధిత పసుపు రైతులకు క్వింటాకు రూ.7 వేలు పరిహారం అందించాలని, వరదల కారణంగా నష్టం జరిగిన రైతులు, కౌలు రైతులు బంగారంపై తీసుకు కున్న రుణాలు 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. పంటల పెట్టుబడి సాయంకు అన్నదాత సుఖీభవ పథకం క్రింద 20 వేల రూపాయలు సాయం అందించాలని, పాడి రైతులకు రెండు లక్షల రూపాయలు బ్యాంకు రుణాలు ఇవ్వాలి, పశువులకు దాణా, ఎండు గడ్డి మేత అందివేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరిగేషన్ డ్రెయినేజీ కాలువలకున్న అడ్డంకులను తొలగించి మురుగు కాల్వలను పంట కాలువలను శుభ్రం చేయాలని కోరారు. వేసవి కాలంలో పంట కాలువలను, మురుగు కాలువలను ఆధునీకరణ చేసి కట్టలను పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత స్టేట్‌బ్యాంక్ ఏజీఎం కాకాని మాధవి, తోడేటి కుమారి, కనగాల శాంతకుమారి, అద్దేపల్లి పద్మ, ఆర్.శ్రావణి, విజయ కుమారి, ఎం.ప్రియాంక, కొల్లి శివపాగిరెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా చిట్యాల ఐలమ్మ జయంతి



ఐలమ్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన బీసీ నేతలు



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దుర్గ, కౌన్సిలర్లు త్రిమూర్తి, బ్రహ్మేశ్వరరావు

తెనాలి: తెలంగాణ పెత్తందారుల సాయుధ పోరాటంలో అణగారిన ప్రజల పక్షాన పోరాడిన చిట్యాల ఐలమ్మ 129వ జయంతిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నేతత్వంలో గురువారం ఘనంగా జరిపారు. స్థానిక రజక చెరువువద్ద గల మున్సిపల్ పార్కులోని చిట్యాల ఐలమ్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఐలమ్మ జీవిత విశేషాలను వివరించారు. ఒక మహిళగా భూమి కోసం, భుక్తి కోసం, భూస్వాముల దోపిడీని ఎదిరించి వారిని గడగడ లాడించిందని అన్నారు. బడుగు బలహీన వారి పట్ల ఆమె చేసిన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం మహిళ యూనివర్సిటీకి చిట్యాల ఐలమ్మ పేరుని పెట్టి గుర్తింపు నిచ్చిందని చెప్పారు. గుంటూరులో కూడా ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఐలమ్మ స్మారకార్థం ఏదొకటి చేయాలని అభిప్రాయపడ్డారు.

తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, బీసీలు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తిని తీసుకుని తమ శక్తిని చాటాలని కోరారు. బీసీ నాయకులు కుర్రా శ్రీను, పోతురాజు శివ, రవిశంకర్, అన్నం గణపతి, అర్నాటి నారాయణ, సుబ్రహ్మణ్యం, కొడాలి శ్రీనివాసరావు, పానుగంటి శ్రీనివాసరావు, రంగా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ఐలమ్మ సేవలు మరువరానివి**

తెనాలిఅర్బన్: పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, బ్రహ్మేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు. టీడీపీ తెనాలి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ఫణీదపు దుర్గ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని రజక పార్కులోని ఆమె విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, చాత్రగడ్డ ఆంజనేయులు, కావేటి వేణు, కొడాలి సుబ్రమణ్యం, మున్నిపల్లి రామకృష్ణ, చీమలదిన్నె విజయ్, పెసర్లంక శ్రీను, మునగా నరసింహా, కృష్ణ, చల్లగాలి శివశంకర్, పూర్ణ, బాబురావు పాల్గొన్నారు.

## పల్లెపాలెంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

భట్టిప్రోలు:ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం (ఏపీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, స్టేషనరీ, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నీలం దేవరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ 12 లంక గ్రామాలలో 300 మంది విద్యార్థులకు రూ.లక్ష వ్యయంతో సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు.

## ధన్యజీవి కొండూరు వీరరాఘవాచార్యులు

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధనశాస్త్రి



చిదంబరేశ్వరరావు దంపతులకు సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి: శిల్పసాహిత్యాలు తనకు జీవగర్రలని చిన్న వయసులోనే మహత్తరమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, జీవితకాలం ఆయా రంగాల్లో అద్భుతమైన కృషిచేసిన కవిపండితుడు 'కళాప్రపూర్ణ' కొండూరు వీరరాఘవాచార్యులు ధన్యజీవి అని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధనశాస్త్రి అన్నారు. డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు ధర్మనిధి, ఆలపాటి కళావతి రవీంద్రపీఠం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖాగ్రంథాలయంలో వీరరాఘవాచార్యులు 112వ జయంతిని నిర్వహించారు. కళావతి రవీంద్రపీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి గోవర్ధనశాస్త్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, వీరరాఘవచార్యులు సాహిత్యంలోనే జీవించి, జీవితంలోనే సాహిత్యాన్ని పెంపొందించుకున్నారని చెప్పారు. తత్వ చర్చలు చేస్తూ ఉపనిషత్తులు, వేదాల్లో నిష్ణాతులై, ఉపనిషద్వనాలను విహారవీధులుగా చేసుకున్నారని తెలిపారు. సాహిత్య వ్యాసాలు, చారిత్రక నవలలు, శిల్పకళాగ్రంథాలు, తాత్విక గ్రంథాలు, వేదరహస్యాలు... వంటి ఎన్నింటినో రచించారని సోదాహరణంగా చెప్పారు. ఎలాంటి వాదోపవాదాలకు తావులేకుండా 'విశ్వశ్రేయం కావ్యం' అన్న సూక్తిని ఆచరిస్తూ తన బాధ్యతలను, లక్ష్యాలను పూర్తిచేశారని చెబుతూ, అలాంటి మహనీయుడి పేరిట ఏటా స్మరించుకోవటం మంచి సంప్రదాయమన్నారు. సభలో విజయవాడకు చెందిన ప్రముఖ చిత్రకారుడు పావులూరి చిదంబరేశ్వరరావుకు డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు స్మారక పురస్కారం ప్రదానం చేసి, సత్కరించారు. వీరరాఘవాచార్యులు పేరుతో ధర్మనిధిని ఏర్పాటుచేసి, ఏటా జయంతిని నిర్వహిస్తూ నేటితరానికి ఆయన సాహిత్యసేవలను తెలియజేస్తున్న కళావతి రవీంద్ర పీఠానికి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈఎల్‌వీ అప్పారావు స్వాగతం పలికిన సభలో పావులూరి శ్రీనివాసరావు, అత్తలూరి రాజేశ్వరి, సామ్రాజ్యలక్ష్మి, శోభాదేవి, స్వరాజ్యలక్ష్మి, శ్రీదేవి, కాటూరి వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, కేశవరావు, జీవీబీ ఆచారి, లైబ్రేరియన్ కావూరి రమాదేవి పాల్గొన్నారు.

### జాబ్ మేళాలో 56 మంది ఎంపిక

రేపల్లె రూరల్: పట్టణంలోని ఆర్‌సీ ఐటీఐ కళాశాలలో గురువారం వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. బ్లూస్టార్, జియో ఫైబర్ నెట్, క్లైమెట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఆసియన్ ఆటో స్పేర్ ప్రైవేట్ లిమిటెడ్, మారుతీ సుజికి తదితర కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 54 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అభ్యర్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బిషప్ ఇమ్మానుయేలు రెబ్బా అభినందించారు.

## ఆరోగ్య రంగంలో ఫార్మసిస్ట్ పాత్ర కీలకం



విజేతలైన ఫార్మా విద్యార్థులతో అధ్యాపకులు

తెనాలి: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో గురువారం ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఫార్మస్యూటికల్ ఫెడరేషన్ పిలుపు ప్రకారం 'ఫార్మసిస్ట్స్ మీటింగ్ గ్లోబల్ హెల్త్ నీడ్స్' అనే అంశంపై కాలేజీ పరీక్ష విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ వి.కోటిరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యం చేసే డాక్టర్ రోగికి ప్రాణం పోస్తే, ఆ వైద్యానికి అమృతాన్ని పోసేవారు ఫార్మసిస్ట్ అని ఆయన చెప్పారు. వైద్య, ఆరోగ్య రంగంలో కీలకమైన ఫార్మసిస్ట్ ప్రాధాన్యతను వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టు పాత్ర కీలకమని తెలిపారు. ఫార్మసీ, ఫార్మా–డీ విద్యార్థులకు పోస్టర్, కేస్ ప్రెజెంటేషన్ పోటీని నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాల్ని పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు ఫార్మసిస్ట్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐపీఏఎస్ఎఫ్ మెంటార్స్ జి.నంద గోపాలకృష్ణ ,పి.భార్గవి, కాలేజీ అధ్యాపక బృందం, బీఫార్మసీ, ఫార్మా–డీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### ఓలేరు వద్ద ట్రైరుబండ్లదారుల ఆందోళన



ఓలేరు(భట్టిప్రోలు): ఇసుక రవాణాలో అధికారుల తీరును నిరసిస్తూ ట్రైరుబండ్ల యజమానులు గురువారం పెనుమూడి–వెల్లటూరు రహదారి మార్గంలో ఆందోళన చేశారు. బండ్లను రోడ్డుకు అడ్డుగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇరు వైపులా మూడు గంటలపాటుట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రైరుబండ్ల దారులకు నచ్చజెప్పే యత్నం చేశారు. భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య ఫోన్‌లో ఆందోళనకారులతో మాట్లాడారు. ట్రైరుబండ్లతో రేవులో నుంచి ఈ రోజు మాత్రమే ఇసుక తీసుకు వెళ్లాలని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ విషయమై ఎస్ఐని సాక్షి వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం గురువారం ఒక్క రోజు మాత్రమే ట్రైరుబండ్లతో ఇసుకను తీసుకువెళ్లమని చెప్పామని పేర్కొన్నారు.